# ఆఖరి అవకాశం

- ఓటు హక్కు దరఖాస్తుకు రేపే తుది గడువు
- 18 ఏళ్లు నిండిన వారంతా సద్వినియోగం చేసుకోవాలి
- ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తుకు అవకాశం



కలెక్టరేట్, అక్టోబర్ 29: వచ్చే ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉవ్విళ్లూరుతున్న 18 ఏళ్లు పూర్తయిన వారికి ఇదే ఆఖరి అవకాశం. ఎన్నికల సంఘం కల్పించిన అవకాశం మేరకు ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు కేవలం ఒక్క రోజు మాత్రమే మిగిలింది. ఈనెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల సంఘం వెబ్‌సైట్ తెరిచి ఉంటుంది. నవంబర్ 1 నుంచి వెబ్‌సైట్ మూసివేయనుండగా, తిరిగి తెరిచే వరకు ఇక అవకాశం ఉండబోదని ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు. ఎన్నికలేవైనా ఓటింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల యంత్రాంగం ఎప్పటికప్పుడు ప్రయత్నాలు చేస్తూనే ఉంటుంది. ఇందులో భాగంగానే ఓటరుగా నమోదుకు, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తూ, దీనిని వినియోగించుకునేందుకు విస్తృత ప్రచారం నిర్వహిస్తుంటుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ఎంతో విలువైనది, అర్హులు సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు నామినేషన్ల రోజు సమీపించే వరకు ఎన్నికల సంఘం అవకాశం కల్పిస్తుంటుంది. నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో అర్హులందరూ ఓటర్లుగా నమోదయ్యేందుకు, ఈనెల 31 వరకు అవకాశం ఇచ్చింది. ఇప్పటికే స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి కొత్త ఓటర్ల నమోదు కోసం అనేక చైతన్య కార్యక్రమాలు నిర్వహించింది. పలు స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు, యువజన సంఘాలను ఇందులో భాగస్వాములను చేసింది. గత ఆరు మాసాలుగా యువత, 18 ఏళ్లు నిండిన వారి కోసం విద్యాసంస్థల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వందశాతం ఓటరు నమోదు కోసం ఎన్నికల సంఘం విశేష కృషి చేసింది. దీంతో అంచనాకు మించి కొత్త ఓటర్లు నమోదయ్యారు. ఈనెల 4న ఎస్ఎస్ఆర్ 2023 తుది జాబితాను ఎన్నికల సంఘం ప్రచురించింది. ఈ జాబితా ప్రకారం జిల్లాలో 10,34,186 మంది ఓటర్లు ఉండగా, ఈ ఏడాది జనవరి 5న విడుదల చేసిన ఓటర్ల జాబితాలో 9,97,143 మంది ఉన్నారు. ఎస్ఎస్ఆర్ 2023తో అదనంగా 37వేల మంది కొత్త ఓటర్లు నమోదయ్యారు. అయినా ఇంకా అర్హులై ఉండి మిగిలిపోయిన వారిని కూడా ఓటరు జాబితాలో చేర్చేందుకు ఈనెల 31 వరకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఓటర్లు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉండడంతో అభ్యర్థులు మొబైల్ ఫోన్ల ద్వారా ఓటు హక్కును నమోదు చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు కూడా నమోదు చేసుకోని వారుంటే మంగళవారం వరకు ఎన్నికల సంఘం నిర్దేశించిన వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. 31లోగా నమోదు చేసుకున్న వారికి మాత్రమే వచ్చే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే సువర్ణావకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. అయితే, ఓటర్ల జాబితా ఇప్పటికే విడుదల కాగా, తాజాగా నమోదయ్యే ఓటర్ల వివరాలతో కూడిన కొత్త జాబితాను ముద్రించి, అనుబంధంగా ప్రకటించనున్నట్లు జిల్లా ఎన్నికల సంఘం వెల్లడిస్తోంది.

### ఓటరుగా నమోదు చేసుకోవాలి

ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు. పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి. ఇప్పటికే ఓటు హక్కు వినియోగంతో పాటు ఓటరుగా నమోదు చేసుకునేలా కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాం. ఓటరుగా నమోదు చేసుకున్న వారు తమ ఓటు హక్కు ఉన్నదో లేదో ఇటీవల విడుదల చేసిన ఓటరు జాబితాలను పరిశీలించాలి. అందులో పేరు లేకపోతే తిరిగి నమోదు చేసుకుని, ఓటు హక్కు వినియోగించుకోవాలి.

-మహేశ్వర్, రిటర్నింగ్ అధికారి

# బీఆర్ఎస్‌ను మెజార్టీతో గెలిపించాలి



దివ్యాంగుడిని ఓటు అభ్యర్థిస్తున్న గంగుల కమలాకర్ సతీమణి రజిత

- పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ సతీమణి రజిత
- చింతకుంటలో ఎన్నికల ప్రచారం

కొత్తపల్లి, అక్టోబర్ 29: కరీంనగర్ నియోజకవర్గ ప్రజలంతా కారు గుర్తుకే ఓటు వేసి బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ సతీమణి రజిత కోరారు. చింతకుంట గ్రామంలో ఆదివారం ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓటు అభ్యర్థించారు. ప్రచారంలో ఎంపీపీ పిల్లి శ్రీలత-మహేశ్, జడ్పీటీసీ పిట్టల కరుణారవీందర్, సర్పంచ్ మంజుల-సమ్మయ్య, ఎంపీటీసీలు శారద-లక్ష్మీనారాయణ, భూక్యా తిరుపతినాయక్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు సతీశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జోరుగా బీఆర్ఎస్ శ్రేణుల ప్రచారం



గోపాల్‌పూర్‌లో ప్రచారం చేస్తున్న జీకే యూత్ గౌరవాధ్యక్షుడు గంగుల ప్రదీప్

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 29: కరీంనగర్ రూరల్ మండలంలో చేసిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జీకే యూత్ గౌరవాధ్యక్షుడు గంగుల ప్రదీప్ కోరారు. కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్ గ్రామంలో జీకే యూత్ అధ్వర్యంలో ఆదివారం ఇంటింటా ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓటు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, ఉప సర్పంచ్ ఆరె శ్రీకాంత్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ గోనె నర్సయ్య, కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ జువ్వాడి రాజేశ్వర్‌రావు, నాయకులు ఊరడి మల్లారెడ్డి, మెడిద రాజిరెడ్డి, మల్లారెడ్డి, జీకే యూత్ అధ్యక్షుడు వెంకట్, దాడి రాములు, యూత్ నాయకులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అల్గునూర్‌లో మైనార్టీ నాయకులకు గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రసమయి



తిమ్మాపూర్‌రూరల్: బీఆర్ఎస్‌లో చేరిన యువకులతో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

# బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలి

- పార్టీ శ్రేణులంతా సైనికుల్లా పనిచేయాలి
- బీఆర్ఎస్ మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్
- పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకులు
- గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 29: బీఆర్ఎస్ శ్రేణులంతా సైనికుల్లా పని చేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని బీఆర్ఎస్ మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ పిలుపునిచ్చారు. నగరంలోని 8వ డివిజన్ (అల్గునూర్)కు చెందిన 50 మంది కాంగ్రెస్ మైనార్టీ నాయకులు ఆదివారం కార్పొరేటర్ సల్ల శారద-రవీందర్, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ సింగిరెడ్డి స్వామిరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ, మైనార్టీలకు కాంగ్రెస్ హయాంలో ఎలాంటి సంక్షేమ పథకాలు అందలేదన్నారు. సీఎం కేసీఆర్ మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తేల్చిచెప్పారు. తెలంగాణ ప్రజలు సారు.. కారు.. సర్కారు అనే నినాదంతో ఉన్నారని, మూడోసారి కూడా కేసీఆర్ సీఎం కాబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన వారిలో ఎండీ సలీం, ఎండీ ఫయాజ్, ఎండీ మీరజ్, ఎంఏ నవీద్, ఎండీ అజార్, షేక్ దావూద్, సయ్యద్ అఫ్సర్, ఎండీ జమీల్ ఖాన్, ఎండీ బాబర్, ఎండీ అశ్రఫ్ అలీ, ఎండీ అతిక్ ఉర్ రహమాన్, ఎండీ తోఫిక్, ఎండీ షఫీ, ఎండీ ఆసిఫ్ హుస్సేన్, ఎండీ ఒవైస్, ఎండీ షోయబ్ అలీ, మొయిజ్, యూనుస్, అంజద్ తదితరులున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, వైస్ ఎంపీపీ వీరారెడ్డి, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి వెంకట్ రెడ్డి, నాయకులు సల్ల మహేందర్, చిల్ల పరశురాములు, పడాల రమేశ్, మంజ సంపత్, లంక రవి, దాసం కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

**తిమ్మాపూర్‌లో...**

తిమ్మాపూర్ రూరల్, అక్టోబర్ 29: ముఖ్యమంత్రి కేసీఆర్ అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. మండలంలోని మన్నెంపల్లి గ్రామానికి చెందిన 50 మంది కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రసమయి మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. అనంతరం కొత్తగా చేరిన నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ, బీఆర్ఎస్ మ్యానిఫెస్టో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మూడోసారి విజయం సాధించడానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాస రావు, వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, నాయకులు పాశం అశోక్ రెడ్డి, పొన్నం అనిల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సీపీఆర్‌పై అవగాహన కల్పించడం అభినందనీయం




మాట్లాడుతున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు

- మేయర్ యాదగిరి సునీల్‌రావు

విద్యానగర్, అక్టోబర్ 29: సైలెంట్ బ్రెయిన్ స్ట్రోక్ ప్రమాదకరంగా పరిణమిస్తోందని, ఈ వ్యాధి బారినపడకుండా ఆరోగ్యంగా ఉండాలంటే శరీరానికి పని చెప్పాలని మేయర్ యాదగిరి సునీల్ రావు పేర్కొన్నారు. వరల్డ్ స్ట్రోక్ డేను పురస్కరించుకొని కరీంనగర్ మెడికవర్ దవాఖాన, ఎస్సారార్ కళాశాల, ఐఎంఏ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఎస్సారార్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కొవిడ్ తర్వాత బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్ స్ట్రోక్‌లు పెరిగాయన్నారు. మెడికవర్ దవాఖాన యాజమాన్యం సీపీఆర్‌పై వేల మందికి శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. దవాఖాన న్యూరో ఫిజీషియన్ డాక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ, బ్రెయిన్ స్ట్రోక్‌తో అవయవాలు శాశ్వతంగా దెబ్బతిని, జ్ఞాపకశక్తి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఐఎంఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాంకిరణ్, డాక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, మెడికవర్ చేపట్టే సీపీఆర్ శిక్షణ, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలకు ఐఎంఏ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. దవాఖాన సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, వైద్యులు డాక్టర్ కొండపాక కిరణ్, డాక్టర్ ఉపేందర్ రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవిమల్లారెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ రోహిణి, హెచ్ఆర్ మేనేజర్ ఈశ్వర్, మార్కెటింగ్ మేనేజర్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.